సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 5 । అక్టోబర్ । 2025

కరెంటోళ్ల నిర్లక్ష్యం!



విద్యుత్‌శాఖ.. తాము చేసిన తప్పుల్ని మాత్రం కప్పిపుచ్చుకోవాలని యత్నిస్తుంది. ఏకంగా 37 వేల మంది విద్యుత్ కనెక్షన్ల ఆధార్ సీడింగ్‌ని తప్పుగా నమోదు చేసేసింది. 8లో



గిరిసీమలో నో సిగ్నల్

గిరిజన గ్రామాల్లో సెల్‌టవర్ల ఏర్పాటుపై అధికారులు, ప్రజాప్రతినిధుల హామీలు గాలి మూటలుగానే మిగిలాయి. 8లో



సిరులతల్లికి తులసిపూజ

విశాఖ: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు.

మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనకు బందోబస్తు ఏర్పాటు చేయాలి

మాజీ ఎమ్మెల్యే గణేష్



డీఎస్పీ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, పార్టీ నాయకులు

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం, భీమబోయినపాలెంలోని మెడికల్ కాలేజీని పరిశీలించేందుకు ఈ నెల 9వ తేదీన మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారని, ఆ పర్యటనలో బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ నర్సీపట్నం డీఎస్పీ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. పర్యటనకు సంబంధించి పూర్తి వివరాలు, షెడ్యూల్ త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు. గణేష్ వెంట వైఎస్సార్‌సీపీ మాకవరపాలెం మండల అధ్యక్షుడు చిటికెల రమణ, మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ నాయకులు మాకిరెడ్డి బుల్లిదొర, బొడ్డు గోవిందరావు, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, రుత్తల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో పలువురికి చోటు

అనకాపల్లి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో పలువురికి చోటు కల్పించారు. రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రెటరీగా ఇతంశెట్టి శ్రీను(నర్సీపట్నం), రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ జాయింట్ సెక్రెటరీగా కల్లెంపూడి వెంకట లోకేష్(నర్సీపట్నం), రాష్ట్ర వైఎస్సార్ టీయూసీ ప్రధాన కార్యదర్శిగా బట్టు పైడిరెడ్డి(పెందుర్తి), రాష్ట్ర ఆర్‌టీఐ వింగ్ జాయింట్ సెక్రెటరీగా పైల మణింద్ర(నర్సీపట్నం)ను నియమించారు. ఈ మేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

నిర్వాసితుల వేదన...
అరణ్య రోదన



ఏపీఐఐసీ నిర్వాసితులకు పెదబోదిగల్లం వద్ద ఏర్పాటు చేసిన లేఅవుట్

విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌నిర్మాణంలో భాగంగా ఏపీఐఐసీకి భూములు, నివాస ప్రాంతాలు ఇచ్చిన నిర్వాసితుల వేదన అరణ్య రోదనగా మారుతోంది. సమస్యలు పరిష్కరించకుండానే గ్రామాలను ఖాళీ చేయించి, 745 మందిని తరలించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మరో పక్క పునరావాస కాలనీలో కనీస సదుపాయాలు కూడా కల్పించలేదు. దీంతో తమ డిమాండ్లు నెరవేర్చి, పునరావాస కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తేనే తాము ఇక్కడ నుంచి కదులుతామని పలు గ్రామాల ప్రజలు ఖరాఖండీగా చెబుతున్నారు. మరో పక్క ఇప్పటికే బల్క్‌డ్రగ్ పార్క్ పనులు ప్రారంభం కాగా, మిట్టల్ స్టీల్ ప్లాంట్ పనులు త్వరలో ప్రారంభం కానుండడంతో ఏం చేయాలో తెలియక అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.



తమ్మయ్యపేటలో పరిహారం చెల్లించాల్సిన పశువుల షెడ్లు

- సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్నా పట్టని ప్రభుత్వం
- డిమాండ్లు తీర్చకుండానే పునరావాసానికి తరలించేందుకు చర్యలు
- 745 మందిని ఖాళీ చేయించేందుకు సన్నాహాలు
- ససేమిరా అంటున్న పలు గ్రామాల ప్రజలు
- అధికారులు మల్లగుల్లాలు



రూ.25 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని పాదయాత్ర చేస్తున్న నిర్వాసితులు (ఫైల్)

నక్కపల్లి: మండలంలో పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం చందనాడ, రాజయ్యపేట, వేంపాడు, బుచ్చిరాజుపేట, అమలాపురం, డీఎల్ పురం, బోయపాడు తదితర గ్రామాల్లో 4,500 ఎకరాలను సేకరించిన విషయం తెలిసిందే. వీటిలో రెండు వేల ఎకరాలు బల్క్ డ్రగ్‌పార్క్‌కు, ఆర్సిలర్ మిట్టల్‌స్టీల్‌ప్లాంట్‌కు 2,020 ఎకరాలను కేటాయించారు. ఈ రెండు కంపెనీల కోసం 290 కుటుంబాలకు చెందిన 745 మంది తమ గ్రామాలను ఖాళీ చేయాల్సి ఉంది. బుచ్చిరాజుపేటలో 30 కుటుంబాలకు చెందిన 92 మంది, చందనాడలో 119 కుటుంబాలకు చెందిన 329 మంది, డీఎల్ పురంలో ఆరు కుటుంబాలకు చెందిన 21 మంది, రాజయ్యపేటలో 53 కుటుంబాలకు చెందిన 108 మంది, వేంపాడులో 82 కుటుంబాలకు చెందిన 195 మంది కలిపి మొత్తం 745 మంది తమ నివాస ప్రాంతాలను ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెదబోదిగల్లం వద్ద 165 ఎకరాల్లో వీరందరికి ప్రభుత్వం పునరావాస కాలనీ ఏర్పాటు చేస్తోంది. రోడ్లు, డ్రైనేజీల పనులు జరుగుతున్నాయి. నిర్వాసితులకు ఒక్కొక్కరికీ ఐదుసెంట్ల చొప్పున ఇంటి స్థలాన్ని లాటరీ పద్ధతిలో కేటాయించారు. డిమాండ్లు పరిష్కరించకుండా ఇంటి స్థలం తీసుకోడానికి లబ్ధిదారులు మొదట నిరాకరించారు. తీసుకోకపోతే స్థలాలు రద్దవుతాయని బెదిరించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకున్నారు. నిర్వాసితులకు ఇంటి స్థలంతో పాటు ఆర్ అండ్ ఆర్‌ప్యాకేజీ కింద ఇంటి నిర్మాణానికి రూ.8.98 లక్షలు ప్రభుత్వం అందజేస్తుంది. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీ ఏమాత్రం సరిపోదని, రూ.25 లక్షలు చెల్లించాలని నిర్వాసితులు కోరుతున్నారు. ఇంటి యజమానితోపాటు, 18 ఏళ్లు నిండిన మేజర్లకు, 2016 నుంచి 2024 మధ్యలో వివాహమైన ఆడపిల్లలకు ఆర్ అండ్ ఆర్‌ప్యాకేజీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం యజమానులకు, 18 ఏళ్లనిండిన మగ పిల్లలకు మాత్రమే ప్యాకేజీ ఇచ్చి, ఆడపిల్లలకు ఇవ్వడం మానేసింది.ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్ తేదీల్లో వివాహమైన ఆడపిల్లలు సుమారు 60 నుంచి70 మంది ఉంటారని వీరందరికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో నిర్వాసితులంతా ఆరు నెలల నుంచి ఆందోళన చేస్తున్నారు. వీరి ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కొంతమంది అర్హులకు కూడా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇంటి స్థలం మంజూరుకాలేదు.మరికొంతమందికి పశువుల షెడ్లకు పరిహారం ఇవ్వకుండానే డిసెంబర్ నెలాఖరులోగా గ్రామాలను ఖాళీ చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది. నిర్వాసితులు పునరావాస కాలనీకి వెళ్లేందుకు ససేమిరా అంటున్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చినప్పుడే వెళతామని చెబుతున్నారు. ఒక పక్క బల్క్‌డ్రగ్‌పనులు ప్రారంభమయ్యాయి. మరో పక్క స్టీల్‌ప్లాంట్ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయింది. దీంతో ప్రభుత్వంపై ఆయా కంపెనీలు ఒత్తిడి చేసే అవకాశం ఉండడంతో ఎలాగైనా వీలైనంత త్వరగా నిర్వాసితులందరినీ తరలించేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోంది. పునరావాస కాలనీలో తాగు నీరు, విద్యుత్ సదుపాయాలు ఇంకా కల్పించలేదు. సామాజిక అవసరాల కోసం పాఠశాల, ఏఎన్ఎం సబ్‌సెంటరు, తాగునీరు కోసం ఓవర్ హెడ్‌ట్యాంకులు నిర్మించాలి. ఉద్దండపురం వాటర్‌గ్రిడ్ నుంచి నీటి సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ నేషనల్ హైవే మీదుగా పైపులైను వేయాలంటే నేషనల్ హైవే అధికారుల అనుమతికావాలి. పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించకుండా తమను తరలిస్తామంటే అంగీకరించేది లేదని నిర్వాసితులు చెబుతున్నారు.

డిమాండ్లు తీర్చాలి



పునరావాసకాలనీకి వెళ్లాలంటే ముందు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ విషయం తేల్చాలి. తాము డిమాండ్ చేస్తున్న విధంగా రూ.25 లక్షల చొప్పున చెల్లించాలి. వివాహమైన ఆడపిల్లలను లబ్ధిదారుల జాబితాలో చేర్చాలి. అర్హులైన నిర్వాసితులకు ఇంటిస్థలం, ఆర్ అండ్ ఆర్‌ప్యాకేజీ ఇవ్వాలి.పశువుల షెడ్లకు, సాగుదారులకు నష్టపరిహారం చెల్లించాలి. పునరావాస కాలనీలో నివాసానికి యోగ్యంగా ఉండేందుకు అవసరమైన సదుపాయాలను కల్పించాలి.

– గెద్దమూరి గోవిందు, నిర్వాసితుడు, తమ్మయ్యపేట

చలనం లేని ప్రభుత్వం



ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం తిరగని రోజు, వెళ్లని కార్యాలయం లేదు.అయినా ప్రభుత్వంలో చలనం లేదు. ఆరునెలల నుంచి పోరాటం చేస్తున్నా పట్టించుకోలేదు. నిర్వాసితులు సర్వం కోల్పోయి కొత్త ప్రాంతంలో నివాసముండాలంటే అన్ని సదుపాయాలు ఉండాలి. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిన రూ.8.98 లక్షలు ఏ మాత్రం సరిపోదు. ప్యాకేజీ రూ.25 లక్షలు ఇవ్వాల్సిందే. కటాఫ్ తేదీ మధ్యలో వివాహమైన ఆడపిల్లలకు ప్యాకేజీ వర్తింపజేస్తేనే నిర్వాసితులు ఇళ్లు ఖాళీ చేస్తారు.

– తళ్ల భార్గవ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు, చందనాడ

చంద్రబాబు పథకాలన్నీ కాపీ పేస్ట్

- ఉత్తరాంధ్ర వనరులను దోచుకుంటున్నారు
- అమరావతిపై ప్రేమతో ఈ ప్రాంతానికి అన్యాయం చేస్తున్నారు
- స్పీకర్ పదవికి అయ్యన్న అనర్హుడు
- ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటానికి సిద్ధం
- వైఎస్సార్ సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు అమర్‌నాథ్, కేకే రాజు



మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్. చిత్రంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల, చింతలపూడి

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, నవ్యాంధ్రప్రదేశ్‌లో కలిపి నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు.. సొంతంగా ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా ప్రవేశపెట్టలేదని వైఎస్సార్ సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, కేకే రాజు విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను, పొరుగు రాష్ట్రాల పథకాలను ఆయన కాపీ పేస్ట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజా పోరాటాలకు సిద్ధమవుతున్నామని వారు స్పష్టం చేశారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి నేతలు ఉత్తరాంధ్ర వనరులను కొల్లగొడుతున్నారని, విశాఖలో సదస్సులు నిర్వహించి, పెట్టుబడులను మాత్రం అమరావతికి తరలిస్తున్నారని ఆరోపించారు. అమరావతిపై ఉన్న ప్రేమతో చంద్రబాబు ఉత్తరాంధ్రపై వివక్ష చూపుతూ.. ఈ ప్రాంత అభివృద్ధి విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి బాట పట్టిన ఉత్తరాంధ్ర.. నేటి కూటమి పాలనలో భ్రష్టుపట్టిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై పోరాటం

పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టారని, వాటిలో పది కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుట్ర చేస్తోందని అమర్‌నాథ్, కేకే రాజు మండిపడ్డారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 9న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లా మాకవరపాలెం వైద్య కళాశాలను సందర్శించి, నిర్మాణ పనులను పరిశీలిస్తారని వారు వెల్లడించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్నవి అర్థం లేని మాటలు

స్పీకర్ పదవికి అయ్యన్నపాత్రుడు అనర్హుడని అమర్‌నాథ్, కేకే రాజు అన్నారు. 'అయ్యన్నలో కనీసం ఒక్క మంచి లక్షణం కూడా లేదు. అబద్ధాలు, అర్థం లేని మాటలు మాట్లాడటం ఆయన నైజం' అని విమర్శించారు.

నేడు వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర విస్తృత స్థాయి సమావేశం

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం 10 గంటలకు ఆనందపురం మండలం పెద్దిపాలెంలోని చెన్నా కన్వెన్షన్ సెంటర్‌లో పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు అమర్‌నాథ్, కేకే రాజు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై చర్చించి.. భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఉత్తరాంధ్రలో జరిగిన అభివృద్ధి, విశాఖ స్టీల్ ప్లాంట్, ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వంటి కీలక అంశాలపై చర్చిస్తామన్నారు. మూలపేట పోర్ట్, భోగాపురం ఎయిర్ పోర్ట్ వంటి ప్రాజెక్టులను ప్రారంభించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. ఈ సమావేశానికి ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, అరకు ఎంపీ జి.తనూజా రాణి, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు హాజరవుతారని తెలిపారు.

ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కేకే రాజు, గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాసరావు తదితరులు

తగరపువలస: పెద్దిపాలెంలోని చెన్నా ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగే వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర విస్తృత స్థాయి సమావేశం ఏర్పాట్లను శనివారం విశాఖ, అనకాపల్లి జిల్లాల పార్టీ అధ్యక్షులు కేకే రాజు, గుడివాడ అమర్‌నాథ్, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తైనాల విజయకుమార్, భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య తదితరులు పరిశీలించారు. జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి గండ్రెడ్డి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బంక సత్యం, మజ్జి వెంకటరావు, షిణగం దామోదరరావు, నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు షిణగం రాంబాబు, రౌతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ పదవికి అయ్యన్నపాత్రుడు అనర్హుడు

మాజీ ఎమ్మెల్యే గణేష్



మీడియా సమావేశంలో మెడికల్ కాలేజీ జీవోను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: స్పీకర్ పదవికి అయ్యన్నపాత్రుడు అనర్హుడని, క్వాలిటీస్ గురించి మాట్లాడే అర్హత అయ్యన్నపాత్రుడికి లేదని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాడు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై స్పీకర్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టారు. వైఎస్ జగన్‌పై విమర్శలు చేయడం సరికాదని, అదే స్థాయిలో తామూ విమర్శలు చేయాల్సి వస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 17 నెలల కాలంలో రూ.83 వేల కోట్లు అప్పు చేస్తే, కూటమి ప్రభుత్వం 17 నెలల కాలంలో రూ.2 లక్షల కోట్లు అప్పు చేసిందని చెప్పారు. అప్పులతో రాష్ట్రాన్ని దివాలా తీయించి సీఎం ఎవరైనా ఉన్నారంటే అదే చంద్రబాబే అన్న విషయాన్ని స్పీకర్ గ్రహించాలన్నారు. స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడుకు ఏవిధమైన క్వాలిటీస్ ఉన్నాయని గణేష్ ప్రశ్నించారు. నడిరోడ్డుపై మున్సిపల్ కమిషనర్, డీఈని, రావికమతం మండలంలో పోలీసులను, అన్‌రాక్ లారీల డ్రైవర్లను బూతులు తిట్టడమేనా స్పీకర్ క్వాలిటీస్ అని ఎద్దేవా చేశారు. నోరు విప్పితే బూతులు మాట్లాడే అయ్యన్నపాత్రుడు క్వాలిటీస్ గురించి మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. సోషల్ మీడియాలో కామెంట్ పెట్టిన వారిని అరెస్టు చేయాలని స్పీకర్ ఆదేశించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్ బూతులు తిడితే అరెస్టు చేయరా అని గణేష్ పోలీసులను ప్రశ్నించారు. స్పీకర్ బూతులు తిట్టవచ్చని రాజ్యాంగంలో ఎక్కడైనా ఉందా అని నిలదీశారు. మెడికల్ కాలేజీ ఏర్పాటుపై జీవో లేదని ప్రజలను నమ్మించేందుకు స్పీకర్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. మెడికల్ కాలేజీపై స్పీకర్‌కు అవగాహన లేదని చెప్పారు. చేతనైతే మెడికల్ కాలేజీ ప్రైవేటు పరం కాకుండా చూడాలన్నారు. ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసి, వైద్య విద్యతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన 17 మెడికల్ కాలేజీల్లో నర్సీపట్నం ఒకటని తెలిపారు. రూ.500 కోట్లతో 600 పడకలతో నర్సీపట్నం నియోజకవర్గం భీమబోయినపాలెంలో మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టినట్టు చెప్పారు. పీపీపీ విధానంలో ఈ కాలేజీని పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం 28 రోజుల క్రితం ప్రత్యేక జీవో ఇచ్చిన విషయం స్పీకర్‌కు తెలియకపోవడం దురదృష్టకరమన్నారు. నర్సీపట్నం మెడికల్ కాలేజీకి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022 ఆగస్టు 8న జీవోను జారీ చేసిందన్నారు. కాలేజీని ప్రైవేటు పరం చేసి, ఈ ప్రాంత పేద ప్రజలను దోపిడీ చేసేందుకు స్పీకర్ కుట్ర చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు తప్పుడు ప్రచారం మానుకుని, ప్రజలకు వాస్తవాలు చెప్పాలని గణేష్ హితవు పలికారు. ఈ సమావేశంలో మాకవరపాలెం మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ మాకవరం పాలెం మండల అధ్యక్షుడు చిటికెల రమణ, పార్టీ నాయకులు రుత్తల శ్రీనివాస్, బొడ్డు గోవిందరావు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పార్కును ఆపండి

- విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించండి
- వాడీవేడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట(విశాఖ): నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును మత్స్యకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, దానిని నిలిపివేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలని జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో రాజ్యసభ సభ్యుడు గొల్లబాబూరావు,పలువురు జెడ్పీటీసీలు డిమాండ్ చేశారు. శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగిన సమావేశం వాడీవేడిగా సాగింది. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ.. బల్క్ డ్రగ్ పార్కు వల్ల మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటుందని, వారి ఆందోళనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే నియోజకవర్గంలో తాను మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలను సేవ చేశానని గుర్తు చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రాష్ట్ర ప్రజల జీవనాడి అని, దానిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తాను ఈ అంశాన్ని ఇప్పటికే మూడుసార్లు రాజ్యసభలో ప్రస్తావించానని, కేంద్ర ఉక్కు మంత్రి కూడా తనకు లేఖ రాశారని గుర్తుచేశారు. కేంద్రం ప్రస్తుతం సీఎం చంద్రబాబు మద్దతుపై ఆధారపడి ఉన్నందున, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని ఎంపీ డిమాండ్ చేశారు. జెడ్పీటీసీలు దొండా రాంబాబు, పైల సన్యాసిరాజు, పెంటకోట స్వామి సత్యనారాయణ తొలుత స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేకంగా బాబూరావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని చైర్‌పర్సన్ సుభద్ర ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో సభ్యులు బల్లలు చరిచి మద్దతు తెలిపారు. సమావేశంలో పలు ఇతర కీలక అంశాలపై కూడా తీర్మానాలు చేశారు. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలను పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలోకి మార్చాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 17 మెడికల్ కాలేజీలకు గత ముఖ్యమంత్రి

మిగతా 8వ పేజీలో ▶

కదం తొక్కిన ఉపాధ్యాయులు



నర్సీపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



చోడవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

నర్సీపట్నం: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శనివారం జిల్లా వ్యాప్తంగా కదం తొక్కారు. నర్సీపట్నంలో సీబీఎం కాంపౌండ్ నుంచి పెదబొడ్డేపల్లి జంక్షన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ర్యాలీని ఉద్దేశించి జిల్లా ఫ్యాప్టో సెక్రటరీ వై.సుధాకరావు, నర్సీపట్నంశాఖ నాయకులు పడాల అప్పారావు, ఎం.చిట్టియ్య, జానకీరామ్‌నాయుడు, డి.నూకరాజు, కె.సత్యనారాయణ, ఆర్.వి.దొర మాట్లాడుతూ నాలుగు డీఎలను మంజూరు చేయాలని, 30 శాతం ఐఆర్ వెంటనే మంజూరు చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో ఆరు మండలాల నుంచి వంద మంది ఉపాధ్యాయులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

చోడవరంలో ఉపాధ్యాయుల బైక్ ర్యాలీ

చోడవరం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. చోడవరం మెయిన్‌రోడ్డులో కాలేజీ జంక్షన్ నుంచి కొత్తూరు వరకూ మోటారు సైకిళ్లపైన ర్యాలీ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, రావలసిన అన్ని రకాల బకాయిలు వెంటనే చెల్లించాలని, ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని వారు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కాలం గడిచినా ఇప్పటి వరకూ ఉపాధ్యాయులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదని ఫ్యాప్టో ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమరాన త్రినాథరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు మైచర్ల మహాలక్ష్మీనాయుడు, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆర్. చిరంజీవి, కె. మల్లేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు గొల్లు శ్రీనివాసరావు, యూటీఎఫ్ ప్రతినిధులు పొలిమేర చంద్రరావు, జేపీఎస్ కృష్ణ, ఎస్టీ,ఎస్సీ ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధి నందికోళ్ల దేముడు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు పి. సూర్యప్రకాష్, కామాక వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి



మృతిచెందిన పాడిగేదెతో రైతు

ఎస్.రాయవరం: మండలంలోని ధర్మవరం అగ్రహారంలో విద్యుత్ షాక్‌తో శనివారం రూ.85 వేల విలువైన పాడి గేదె మృతి చెందింది. కర్రి ఈశ్వరరావుకు చెందిన గేదె మేతకు కొబ్బరితోటలోకి వెళ్లింది. అక్కడ తెగిపడి ఉన్న విద్యుత్ తీగలను తాకడంతో షాక్‌కు గురై మృతి చెందింది. బాధితుడు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

ఉత్తమ సర్పంచ్‌కు ఘన సత్కారం



ఉత్తమ సర్పంచ్ వెంకటప్రశాంతి దంపతులను సత్కరిస్తున్న ఎంపీడీవో మీనాకుమారి

ఎస్.రాయవరం: పెట్టుగోళ్లపల్లి సర్పంచ్ అల్లు వెంకటప్రశాంతి నరసింహమూర్తి దంపతులను శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మీనాకుమారి ఘనంగా సత్కరించారు. ఆమె ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికై ఢిల్లీలో స్వాతంత్ర్య వేడుకలకు హాజరైన విషయం విదితమే. తాను పనిచేసే మండలంలో ఉత్తమ అవార్డు తెచ్చుకున్న సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

'ఆటో డ్రైవర్ల సేవలో' ప్రారంభం



పథకం ప్రారంభోత్సవంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ విజయకృష్ణన్

నర్సీపట్నం: ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని స్థానిక మార్కెట్‌యార్డ్‌లో శనివారం ప్రారంభించారు. కలెక్టర్ విజయకృష్ణన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ సీఎం రమేష్, జిల్లా రవాణా శాఖ అధికారి మనోహర్, ఆర్డీవో వెంకటరమణ పాల్గొన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకం చెక్కును స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కొల్లు రవీంద్ర లబ్ధిదారులకు అందజేశారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 13,753 మంది డ్రైవర్లకు సుమారు రూ. 20.62 కోట్లు లబ్ధి చేకూరింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. ప్రతి ఆటో సోదరుడు సంతోషంగా ఉండాలనే ఈ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ విజయకృష్ణను మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న నగదును సక్రమంగా వినియోగించుకోవాలన్నారు.

కరెంటోళ్ల నిర్లక్ష్యం!

విద్యుత్ కనెక్షన్లకు ఆధార్ సీడింగ్ అస్తవ్యస్తం

- ఈపీడీసీఎల్ సిబ్బంది బాధ్యతారాహిత్యం
- 11 సర్కిళ్ల పరిధిలో 37,749 విద్యుత్ కనెక్షన్లకు తప్పుగా ఆధార్ సీడింగ్
- ఒకే ఆధార్‌తో 500 ఇళ్లకు అనుసంధానం
- విశాఖ సర్కిల్ పరిధిలోనే అత్యధికంగా 4,012 కేసులు
- విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో బహిర్గతం



ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం

సాక్షి, విశాఖపట్నం: కరెంట్ బిల్లు కట్టకపోతే.. సామాన్యుల ఇళ్లని చీకటిమయం చేసే విద్యుత్‌శాఖ.. తాము చేసిన తప్పుల్ని మాత్రం కప్పిపుచ్చుకోవాలని యత్నిస్తుంది. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 37 వేల మంది విద్యుత్ కనెక్షన్ల ఆధార్ సీడింగ్‌ని తప్పుగా నమోదు చేసేసింది. ఫలితంగా దాదాపు 90 శాతం మంది ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమైపోయారు. ఇటీవల వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్‌ఎఫ్) చేసిన పరిశీలనల్లో.. ఏపీఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య వైఖరి బట్టబయలైంది. ఒకే ఒక్క ఆధార్ నంబర్‌ని ఏకంగా 500 ఇళ్లకు అనుసంధానం చేసేశారు. ఇలా.. ఒక ఆధార్ నంబర్‌ని 10 నుంచి 500 ఇళ్లకు సీడింగ్ చేస్తూ.. అడ్డగోలుగా వ్యవహరించారు. నెలరోజుల్లో తప్పులు సరిదిద్దాలంటూ సీజీఆర్‌ఎఫ్ ఈపీడీసీఎల్‌కు హెచ్చరిక జారీ చేసింది.

11 సర్కిళ్ల పరిధిలో 37,749 ఇళ్లకు తప్పుడు సీడింగ్.!

ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, రాజమహేంద్రవరం, పశ్చిమ గోదావరి, ఏలూరు సర్కిళ్ల పరిధిలోని కొందరు వినియోగదారులు సీజీఆర్‌ఎఫ్‌కు గత కొద్ది నెలలుగా ఫిర్యాదులు చేస్తున్నారు. తాము అర్హులమైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నామని.. విద్యుత్ బిల్లుల కారణంగానే జరుగుతోందని సచివాలయంలోనూ, మండల కార్యాలయాల్లో చెబుతున్నారంటూ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. దీనిపై సీజీఆర్‌ఎఫ్ ఆరా తీసింది. సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ అధ్యక్షతన సభ్యులు ఎస్.రాజాబాబు(టెక్నికల్), ఎస్ మురళీకృష్ణ(ఇండిపెండెంట్) క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేశారు. ఆగస్టు 19న తుది విచారణ పూర్తి చేశారు. మొత్తం తమ పరిశీలనలో విస్తుపోయేలా విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్య వైఖరికి అద్దంపట్టే అంశాలు బట్టబయలయ్యాయి. ఆగస్టు 19 నాటికి ఈపీడీసీఎల్ పరిధిలోని 11 సర్కిళ్లలో 37,749 విద్యుత్ కనెక్షన్లకు తప్పుగా ఆధార్ సీడింగ్ జరిగిందని తేలింది. పరిశీలన సమయంలో సర్కిళ్ల ఎస్‌ఈలు పాల్గొని సీడింగ్ ప్రక్రియలో లోపాలను స్పెషల్ డ్రైవ్ ద్వారా సరిదిద్దే ప్రక్రియ నిర్వహించారు.

విశాఖ సర్కిల్‌లో 2 ఆధార్లతో 1000 ఇళ్లకు సీడింగ్!

విద్యుత్ కనెక్షన్లను ఆధార్ సీడింగ్ చేయాలంటే ఇంటింటికీ వెళ్లి ఆధార్ నంబర్‌ని సేకరించడం.. లేదా ఫోన్ ద్వారా సేకరణ ప్రక్రియ చేపట్టడం చేయాల్సి ఉంది. కానీ ఈపీడీసీఎల్‌లోని కొంతమంది సిబ్బంది తమ వద్ద ఉన్న కనెక్షన్ల ప్రకారం.. అందులో ఉన్న ఆధార్ నంబర్లను సేకరించి.. సీడింగ్ ప్రక్రియని అడ్డగోలుగా చేసేశారు. కొన్ని చోట్ల ఒకే ఆధార్ నంబర్‌ని 500కి పైగా విద్యుత్ కనెక్షన్లకు సీడింగ్ చేసేశారు. కొన్ని ఆధార్ నంబర్లను 10, 20, 100, 400.. ఇలా.. తమకు నచ్చినట్లుగా అనుసంధానం చేసేసి.. చేతులు దులిపేసుకున్నారు. ఫలితంగా పరిమితికి మించి విద్యుత్ వినియోగించకున్నా లబ్ధిదారులు సంక్షేమ పథకాలకు దూరమైపోయారు. కొన్ని సర్కిళ్ల పరిధిలో ఒకే ఆధార్ నంబర్‌తో 500 ఇళ్ల విద్యుత్ కనెక్షన్లను సీడింగ్ చేసేశారంటే.. ఎలా కళ్లుమూసుకొని పనిచేశారో అర్థం చేసుకోవచ్చు. సీజీఆర్‌ఎఫ్ హెచ్చరికలతో అప్రమత్తమైన విద్యుత్‌సిబ్బంది దిద్దుబాటు ప్రక్రియ చేపడుతున్నారు. 37,749 కనెక్షన్లలో ఇంకా 13,572 కనెక్షన్లు సరిచేయాల్సి ఉంది. నెలరోజుల వ్యవధిలో ఈ ప్రక్రియ పూర్తి చేయాలంటూ సీజీఆర్‌ఎఫ్ తీర్పునిచ్చింది.

ఈపీడీసీఎల్ పరిధిలో ఆధార్ సీడింగ్‌లో లోపాలు

ఒకే ఆధార్‌ని 500కిపైగా ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	3
ఒకే ఆధార్‌ని 401 నుంచి 500 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	3
ఒకే ఆధార్‌ని 301 నుంచి 400 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	10
ఒకే ఆధార్‌ని 201 నుంచి 300 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	14
ఒకే ఆధార్‌ని 101 నుంచి 200 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	77
ఒకే ఆధార్‌ని 51 నుంచి 100 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	245
ఒకే ఆధార్‌ని 10 నుంచి 50 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	13,220
మొత్తం కేసులు	-	13,572

అనకాపల్లి సర్కిల్‌లో...

ఒకే ఆధార్‌ని 101 నుంచి 200 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు- 6
ఒకే ఆధార్‌ని 51 నుంచి 100 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు- 13
ఒకే ఆధార్‌ని 10 నుంచి 50 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు- 877
మొత్తం కేసులు- 896

తప్పులు సరిచేశాక నివేదిక ఇవ్వాలని ఆదేశాలు



ఏపీఈపీడీసీఎల్ డేటాబేస్‌లో వివిధ కారణాల వల్ల కొన్ని విద్యుత్ సర్వీస్‌ల ఆధార్ సీడింగ్‌లో తప్పులు దొర్లాయి. ఆధార్ సీడింగ్ తప్పుగా జరగడం వల్ల చాలా మంది అర్హులు ప్రభుత్వ పథకాలను దక్కించుకోలేకపోయారు. నష్టపోయిన విద్యుత్ వినియోగదారులు సీజీఆర్‌ఎఫ్‌ను ఆశ్రయించి నష్టపరిహారం, న్యాయం పొందవచ్చు. ప్రతి ఒక్కరూ గోప్యత హక్కు కూడా కలిగి ఉన్న నేపథ్యంలో వినియోగదారుల అనుమతి, సంతకం లేదా వేలి ముద్ర తప్పనిసరిగా తీసుకుని ఆధార్ నెంబర్‌ను విద్యుత్ సర్వీస్ కనక్షన్‌కు అనుసంధానం చేయాలి. తప్పులు సరిచేయాలని ఆదేశించాం. సరిచేసిన తర్వాత నివేదికలు ఇవ్వాలని ఈపీడీసీఎల్ అధికారులకు స్పష్టం చేశాం.

బి.సత్యనారాయణ, విశ్రాంత జడ్జి, సీజీఆర్‌ఎఫ్ చైర్మన్

బాధిత వినియోగదారులకు పరిహారం ఇవ్వాలి



ఆధార్ సీడింగ్ తప్పిదాలను రియల్ టైమ్ సాంకేతికతతో సరిచేయాలి. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సీడింగ్ సమాచారం ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావడం లేదు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. ఆధార్ సీడింగ్ వల్ల నష్టపోయిన వినియోగదారులకు పరిహారం ఇవ్వాలి. ఇప్పటికే సీజీ నెం. 235/2024 కేసులో బాధితులకు నష్టపరిహారం మంజూరైంది. ఆధార్ అనుసంధానంలో పారదర్శకత తప్పనిసరిగా ఉండాలి. సీజీఆర్‌ఎఫ్ తీర్పు బాధ్యతరాహిత్యం.. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందికి చెంపపెట్టులాంటిది.

-కాండ్రేగుల వెంకటరమణ, కన్సూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభోత్సవంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న స్పీకర్

గొలుగొండ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, అప్పుడే మానసికంగా ఎంతో ఉత్సాహంగా ఉంటారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. గొలుగొండ మండలం ఏఎల్ పురం(కృష్ణదేవిపేట) హైస్కూల్లో రాష్ట్ర స్థాయి జూనియర్ 12వ సాఫ్ట్‌బాల్ పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. ముందుగా రాష్ట్రంలో 13 ఉమ్మడి జిల్లాలను వచ్చిన జట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ అండర్-14 విభాగం పోటీల్లో 416 మంది బాలబాలికలు పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అల్లూరి సీతారామరాజు నడియాడిన ఈ ప్రాంతంలో ఇటువంటి గొప్ప కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామన్నారు. ప్రస్తుతం క్రీడలపై చిన్నచూపు ఉందని, ఇకనుంచి పలు రకాల క్రీడా పోటీలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి తనవంతు సాయంగా రూ.50 వేలు ఇస్తున్నట్టు ప్రకటించారు. ఏఎస్పీ దేవిప్రసాద్, నర్సీపట్నం డీఎస్పీ పి. శ్రీనివాసరావు, నిర్వాహకులు రమణ, శ్రీనివాసరావు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, సర్పంచ్ లోచల సుజాత పాల్గొన్నారు.

నకిలీ ఏసీబీ అధికారులతో జాగ్రత్త

అనకాపల్లి: అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారుల పేరుతో కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్లు చేస్తూ మోసం చేస్తున్నారని, అటువంటి వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఏసీబీ డీఎస్పీ బి.వి.ఎస్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల కాలంలో కొంత మంది ఏసీబీ అధికారుల పేర్లను ఉపయోగించుకుని ఫోన్‌కాల్స్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తూ, బెదిరిస్తున్నారని తెలిపారు. ఇటువంటి ఫోన్‌కాల్స్‌ను నమ్మొద్దని చెప్పారు. ఏసీబీ అధికారులు ఫోన్ ద్వారా డబ్బులు లేదా ఇతర ప్రయోజనాలు అడగరని తేల్చి చెప్పారు. ఏసీబీ పేరుతో డబ్బు అడిగే వారు పూర్తిగా మోసగాళ్లను స్పష్టం చేశారు. అలాంటి ఫోన్‌కాల్స్‌పై ప్రభుత్వ ఉద్యోగులు స్పందించవద్దన్నారు. అటువంటి వారిపై తక్షణమే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, అలాగే ఏసీబీ అధికారులకు కూడా తెలియజేయాలన్నారు. వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గిరిసీమలో నో సిగ్నల్

- సెల్ టవర్ల ఏర్పాటుపై నెరవేరని స్పీకరు అయ్యన్న హామీ
- ఇద్దరు కలెక్టర్లకు విన్నవించినా నిరాశే
- సరుగుడులో మొరాయిస్తున్న బీఎస్ఎన్ఎల్ టవరు
- 16 గ్రామాల గిరిజనులకు అందని ప్రభుత్వ సేవలు



కలెక్టరు విజయకృష్ణన్‌కు దృష్టికి తీసుకెళ్లిన ఎంపీపీ లక్ష్మణమూర్తి (ఫైల్)



సుందరకోట సభలో స్పీకరు అయ్యన్న దృష్టికి తీసుకెళ్లిన ఎంపీపీ లక్ష్మణమూర్తి (ఫైల్)



సిరిపురంలో రవిపట్టాన్‌శెట్టికి వినతి పత్రం ఇస్తున్న సరుగుడు, సుందరకోట పెద్దలు (ఫైల్)

నాతవరం: గిరిజన గ్రామాల్లో సెల్‌టవర్లు ఏర్పాటుపై అధికారులు, ప్రజాప్రతినిధుల హామీలు గాలి మూటలుగానే మిగిలాయి. దాంతో ప్రభుత్వ సేవలందక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2022లో సరుగుడు, సుందరకోట పంచాయతీల్లో పర్యటించిన అప్పటి కలెక్టరు రవి పట్టాన్‌శెట్టికి, ఇటీవల సుందరకోట పంచాయతీలో గ్యాప్ ఏరియా భూములు పరిశీలనకు వచ్చిన కలెక్టరు విజయకృష్ణన్‌కు గతేడాది నవంబరులో సుందరకోట సభలో స్పీకరు అయ్యన్నపాత్రుడుకు సెల్ టవర్లు లేక పడే బాధలను మొరపెట్టుకున్నారు. ఇంతవరకూ వీరిచ్చిన హామీలు నెరవేరలేదని వాపోతున్నారు. సరుగుడులో బీఎస్ఎన్ఎల్ టవరు తరుచూ మొరాయిస్తుండటంతో సిగ్నల్స్ రాక ఆన్‌లైన్ సేవలకు అంతరాయం కలుగుతోంది. ఒక్కొక్క రోజు గంటలకొద్దీ సిగ్నల్స్ రావడం లేదు. దాంతో ఇక్కడ గ్రామ సచివాలయంలో సకాలంలో పౌర సేవలు అందడం లేదు. ఈ సెల్ టవరు ద్వారా సరుగుడు, సుందరకోట పంచాయతీల పరిధిలో 16 శివారు గ్రామాలు ఆధారపడి ఉన్నాయి. పింఛన్లతోపాటు నిత్యావసర సరుకులు లబ్ధిదారులకు అందించాలన్నా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

స్పీకర్ హామీకి అతీగతీ లేదు..

గతేడాది నవంబరు 24వ తేదీన సుందరకోట గ్రామ సభలో అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి 16 గ్రామాల గిరిజనులు రాజకీయాలకు అతీతంగా ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో తీసుకెళ్లారు. ఇతర గిరిజన గ్రామాల్లో అదనంగా మరో మూడు టవర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పరంగా జరిగే కార్యక్రమాలే కాకుండా ప్రైవేటు కార్యక్రమాలు సైతం టవరు పని చేయక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దానికి స్పందించి సెల్ టవర్ ఏర్పాటుకు హామీ ఇచ్చినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. సరుగుడు గ్రామ సచివాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదులు వేదికలో ప్రజలు అర్జీలు సమర్పిస్తున్నారు. వీటిని ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలంటే సిగ్నల్ అందక తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. కొండలపై ఉన్న 16 గిరిజన గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, రామన్నపాలెంలో గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు ప్రభుత్వ పరమైన సేవలు సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి సెల్ టవరు పని చేసేలా చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

మా బాధలు ఎవ్వరికి చెప్పకోవాలి



నేను గత కలెక్టరు రవి పట్టాన్‌శెట్టికి ప్రస్తుత కలెక్టరు విజయ కృష్ణన్‌కు సెల్ టవర్ల విషయమై విన్నవించాను. గత ఏడాది నవంబరులో స్పీకరు అయ్యన్నపాత్రుడు సుందరకోట గ్రామానికి వచ్చినప్పుడు సెల్ టవర్లు లేక గిరిజనులు పడుతున్న బాధలు వివరించాను. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పొందాలంటే సాంకేతిక అవాంతరాలు ఎదురవుతున్నాయి. సాంకేతిక సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేటికీ పట్టించుకోలేదు. ఇక మేము ఈ సమస్య ఇంకెవ్వరికి చెప్పుకోవాలి.

– సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీపీ, నాతవరం

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు పాములవాక విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో పీడీ సావిత్రి

కోటవురట్ల: జిల్లా స్థాయి జూడో పోటీల్లో పాములవాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. గోపాలపట్నంలోని బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన అండర్ – 17 బాలురు 90–80 కిలోల జూడో, రెజ్లింగ్‌లో విద్యార్థులు పి.మనోజ్, కె.గణేష్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హెచ్‌ఎం కె.వి.లక్ష్మీనారాయణ, పీడీ కె.సావిత్రి అభినందించారు.

బల్క్‌డ్రగ్ పార్కును ఆపండి

▶7వ పేజీ తరువాయి



రాజ్యసభ సభ్యుడు బాబూరావు



హాజరైన ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని, కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

రైతుల బకాయిలు చెల్లించాలి

చోడవరం షుగర్ ఫ్యాక్టరీ రైతులకు చెల్లించాల్సిన కోట్లాది రూపాయల బకాయిలను తక్షణం విడుదల చేయాలని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకుండా రైతులకు మొక్కజొన్న వేయమని చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. రైతుల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ చేసిన తీర్మానాన్ని చైర్‌పర్సన్ ఆమోదించారు.

అనంతగిరిలో హైడ్రో ప్రాజెక్టు వద్దు

అనంతగిరిలో హైడ్రో ప్రాజెక్టును నిలుపుదల చేయాలని జెడ్పీటీసీ సభ్యులు గంగరాజు, చెట్టి రోష్మిణి డిమాండ్ చేశారు. అల్లూరి కలెక్టర్, ఎస్పీలు దగ్గరుండి ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించడం విచారించదగిన విషయమన్నారు.

మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయి

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, మహిళలకు రక్షణ కరువైందని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపించారు. సెప్టెంబర్ 5న గిరిజన బాలికపై సామూహిక లైంగిక దాడి జరిగితే ఇంతవరకు కేసు నమోదు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కలెక్టర్‌కు ఆ బాలిక ఫిర్యాదు చేసిందన్నారు. హోంమంత్రి సొంత జిల్లాలో లైంగిక దాడులు జరుగుతున్నా.. చర్యలు తీసుకునే వారు లేరని ఆరోపించారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టం ఎంత జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ఏం చేసిందో చెప్పాలని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. యూరియా సరఫరా చేయడంలోనూ కూటమి విఫలమైందని ఆమె మండిపడ్డారు.

పాటిపల్లి ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ సందర్శన



పాటిపల్లిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు

మునగపాక: మండలంలోని పాటిపల్లిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను శనివారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు సందర్శించారు. కేంద్రం ద్వారా అందుతున్న రోజువారీ సేవలతో పాటు మాతా శిశు సేవలను, రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర్ బాలికల గృహాలను సందర్శించారు. బృందం సభ్యులు కె.జగదీష్, జిల్లా గణాంకాధికారి ఎ.రామచంద్రరావు, డేటా మేనేజర్ జనార్దన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేసుకుంటూ వైద్యుల సూచన మేరకు మందులు వేసుకోవాలని తెలిపారు. కిల్కారీ సేవలపై అవగాహన కల్పించారు. సీహెచ్‌వో దేవకాంత, సూపర్‌వైజర్లు వీఎస్‌ఎం లక్ష్మి,ఎం.నాగేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు యామిని, దీన, వినీల, దుర్గ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాజీ ఎంపీ సత్యవతికి అభినందనలు



బీవీ సత్యవతిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు

అనకాపల్లి: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా నియమితులైన మాజీ ఎంపీ బీవీ సత్యవతికి పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. ఆ పార్టీ 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం. నాయుడు, నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీప ఎంపీ స్వగృహంలో ఆమెను మర్యాద పూర్వంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ పిలుపు మేరకు ప్రజల పక్షాన పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు కాండ్రేగుల శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అనకాపల్లి: అనకాపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం మేడపైన ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, మండల పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు తప్పక హాజరుకావాలని ఎంపీడీవో ఆశాజ్యోతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కును తక్షణం రద్దు చేయాలి



బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా నెహ్రూచౌక్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

అనకాపల్లి: నక్కపల్లి మండలంలో తలపెట్టిన బల్క్ డ్రగ్ పార్కును తక్షణమే రద్దు చేయాలని, మత్స్యకారులను ఇబ్బంది పెట్టిన ప్రభుత్వాలు ఎప్పుడు నిలబడలేదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద బల్క్ డ్రగ్ పార్కు వ్యతిరేకంగా శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేస్తే తీవ్రమైన కాలుష్యం వెదజల్లి మత్స్య సంపద, పచ్చని పంట పొలాలు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. ఇప్పటికే ఫార్మా వ్యర్థాలతో సముద్రంలో చేపలు మృత్యువాత పడుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు పరమేశ్వరి, దేవుడుబాబు, బాబ్జి, సత్తిబాబు, వెంకటేశ్వరరావు, భద్రం, విత్తనాల పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 92 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,510	5,200
రెండో రకం	4,090	4,500
మూడోరకం	3,500	3,780

అనకాపల్లి సినిమాలు

రాజా	: ఇడ్లీ కొట్టు
సత్యనారాయణ స్క్రీన్-1	: కాంతార
సత్యనారాయణ స్క్రీన్-2	: టన్నెల్
పర్తిసాయి	: ఓజీ
షిర్డిసాయి	: ఓజీ
వెంకటేశ్వర	: కాంతార
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9, బీ పాజిటివ్-6, ఓ పాజిటివ్-12, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యూ.లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 395 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 336 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

ఆర్టీసీ కాంప్లెక్స్.. దుర్గంధభరితం

- ప్రయాణికులకు తప్పని అవస్థలు
- సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కంపుకొడుతోంది. దుర్వాసనతో ప్రయాణికులు ముక్కుమూసుకుని బస్సులు వచ్చే వరకు వేచి ఉంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. అనకాపల్లి పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరువాత కూడా కాంప్లెక్స్ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. గ్రామీణ జిల్లాల నుంచి అనకాపల్లి పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు నిత్యం వేలాది మంది విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, వ్యాపారులు వివిధ పనులపై రాకపోకలు సాగిస్తున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది.

ప్లాట్ ఫారంపైకి వర్షపు నీరు

చిన్నపాటి వర్షానికే కాంప్లెక్స్‌లో వర్షపు నీరు నిలిచిపోతోంది. కాంప్లెక్స్‌కు ఆనుకుని రెండు పిల్ల కాలువలు ఉండడం.. పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. డ్రైనేజీలో నీరు, మలమూత్ర విసర్జన, వర్షపునీరు కాంప్లెక్స్‌లోని ప్లాట్‌ఫారంపైకి రావడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణణాతీతం. అనకాపల్లి ప్రధాన రహదారి నుంచి కాంప్లెక్స్‌లోకి వచ్చే ప్రయాణికులు రహదారికి ఇరువైపులా ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. పార్కింగ్‌కు ఎటువంటి అనుమతులు లేకపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ పార్కింగ్ ప్రదేశంలో మూడు, నాలుగు రోజుల పాటు వర్షపునీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. అటుగా వెళ్లే ప్రయాణికులు ముక్కు మూసుకుని కాంప్లెక్స్‌లోకి ప్రవేశించే పరిస్థితి నెలకొంది.

పేరుకుపోయిన చెత్త

కాంప్లెక్స్ ఆవరణలో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయింది. పారిశుధ్య కార్మికులు అంతంత మాత్రం పారిశుధ్య పనులు చేపడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బస్సులు కాంపెక్స్‌లో వచ్చే మార్గంలో చెత్త కుప్పలుగా దర్శనమిస్తోంది. కుక్కలు చెత్తా చెదారాన్ని కాంప్లెక్స్ ఆవరణలోనికి లాక్కొచ్చి చిందరవందరగా తయారు చేస్తున్నాయి.



కాంప్లెక్స్‌లోకి బస్సులు వచ్చే మార్గంలో పేరుకుపోయిన చెత్త



కాంప్లెక్స్‌లో నిత్యం నిల్వ ఉన్న మురుగునీరు



శిథిలావస్థకు చేరుకున్న సులభ్ కాంప్లెక్స్

శిథిల స్థితిలో మరుగుదొడ్డి

కాంప్లెక్స్ ఆవరణలో బస్సులు పార్కింగ్ చేసే ప్రదేశంలో సుమారుగా 10 సంవత్సరాలు క్రితం చిన్నపాటి మరుగుదొడ్డిని ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నిర్మించారు. ప్రస్తుతం నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ప్రయాణికులు ఆరుబయట మల విసర్జన చేస్తున్న దుస్థితి నెలకొంది.



కాంప్లెక్స్ ప్రధాన రహదారిలో మురుగునీటితో నిండిన కాలువ

కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేయాలి

కాంప్లెక్స్‌కు వెళ్లాలంటే దుర్వాసన వస్తుంది. వర్షపు నీరు రెండు, మూడు రోజులు నిల్వ ఉండిపోవడంతో దోమలకు నిలయంగా మారింది. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా జల్లడం లేదు. కాంప్లెక్స్ పర్యవేక్షణను అధికారులు గాలికి వదిలేశారు. తక్షణం కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేయాలి.

– దొంక సత్తిబాబు, ప్రయాణికుడు, అనకాపల్లి

అంటువ్యాధులు సోకే అవకాశం

కాంప్లెక్స్‌పై పర్యవేక్షణ లేకుండా పోయింది. రోజురోజుకు ప్రయాణికుల రాకపోకల సంఖ్య పెరుగుతోంది. కాంప్లెక్స్‌లో కనీస మౌలిక సదుపాయాలు లేవు. అపరిశుభ్రత వాతావరణం కారణంగా ప్రయాణికులకు అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉంది. వర్షపునీరు బయటకు పోయే మార్గంపై దృష్టి సాధించాలి.

– పి.శ్రీనివాసరావు, ప్రయాణికుడు, అనకాపల్లి

భక్తిశ్రద్ధలతో ఉరుసు



కశింకోటలో చందనం ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

కశింకోట: కశింకోటలో ప్రసిద్ధి చెందిన హజ్రత్ సయ్యద్ అబ్దుల్ అజీజ్ షా ఖాదరీ బాబా దర్గా ఉరుసు(చందనోత్సవం) శనివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రెండో రోజు ప్రధానమైన ఉరుసు ఉత్సవం సందర్భంగా స్థానిక దర్గా నుంచి అగ్రహారం వరకు పెద్ద బజారు, సంతబయలు, జాతీయ రహదారి మీదుగా చందనాన్ని గుర్రంపై ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం చందనాన్ని తిరిగి దర్గా వరకు ఊరేగింపుగా తీసుకు వచ్చి ఖాదరీ బాబా సమాధికి పూశారు. చాదర్లు కప్పారు. పూలు జల్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఉత్సవంలో ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు ఉభయ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ముస్లింలతో పాటు హిందువులు కూడా పాల్గొన్నారు. ఉత్సవం సందర్భంగా దర్గాను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

దర్గా కమిటీ అధ్యక్షుడు చిక్కం గురు ప్రసాద్(బాబు), సభ్యులు సయ్యద్ అబ్దుల్ అజీజ్ ఖాదరీ(ముజీబ్), హాజీ సయ్యద్ జాఫర్ అలీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం నిర్వహించే చిరాగి (దీపారాధన)తో ఉత్సవం ముగియనుంది.

తక్షణం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జిల్లా చైర్మన్ బోయిన చిన్నారావు, జనరల్ సెక్రటరీ వై.సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో శనివారం ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీ నాలుగురోడ్ల జంక్షన్ నుంచి చిన నాలుగురోడ్ల జంక్షన్ మీదుగా ఆర్డీవో ఆఫీస్ వరకు సాగింది. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్‌సీ బకాయిలు, డీఏలు తక్షణమే విడుదల చేయాలని, ఐఆర్ 30 శాతం ఇవ్వాలని, 12వ పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే వినియోగించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, గణపతి, వై.శ్రీనివాసరావు, రాము, స్వామి, ఎం.బాబూరావు, అక్కునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



కశింకోట: కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని శనివారం వజ్ర కవచాలతో పాటు పూలమాలలు, తులసీ మాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నరసింగబిల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు చేశారు.

రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు కశింకోట విద్యార్థి



విద్యార్థి కేశవ్

కశింకోట: కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థి రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యాడు. గోపాలపట్నంలో శనివారం నిర్వహించిన ఉభయ విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ పోటీలో డీపీఎన్ హైస్కూలు విద్యార్థి బి.కేశవ అండర్-17 విభాగంలో సత్తా చాటి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్.జె.వి.ప్రసాద్, పీడీలు వి.ప్రభాకరరావు, పెంటకోట కమల తెలిపారు. కేశవకు విద్యా కమిటీ చైర్మన్ నక్కా నాగమణి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

మాజీ సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్

అనకాపల్లి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9న మాకవరపాలెం మండలంలో నిర్మాణ దశలో ఉన్న మెడికల్ కళాశాలను పరిశీలించేందుకు రానున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. జగన్ పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. స్థానిక రింగ్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తే, కూటమి పాలనలో ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు కారుచౌకగా ధారాదత్తం చేయడం అన్యాయమన్నారు. రానున్న రోజుల్లో ప్రజలే కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డేడ శివ, మూనూరు శ్రీనివాసరావు, నక్కరాజు ప్రభాకర్, కొంకి శ్రీరామమూర్తి, మరిపల్లి శోభ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ నిమజ్జనోత్సవం



మెయిన్ రోడ్ గూండా కనకదుర్గ అమ్మవారిని ఊరేగిస్తున్న మహిళలు



కామాక్షి దేవి ఆలయం వద్ద నుంచి ఊరేగింపుగా వెళ్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్: పట్టణంలో కనకదుర్గ అమ్మవారి ఉత్సవ విగ్రహాల నిమజ్జనోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గవరపాలెం, వేల్పులవీధి, లక్ష్మీదేవి పేట, గాంధీనగరం, నర్సింగరావు పేట, మళ్ళవీధి, చిన్నవీధి, నిదానందొడ్డి, ఇలా వాడవాడలా ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన రథాలపై ఉంచి భజనలు, మేళ తాళాలతో ఊరేగించి శారదానదిలో నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జీవీఎంసీ జోనల్ చైర్మన్ కె.చక్రవర్తి, పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని నిదానందొడ్డి వీధిలో కొలువుదీరిన కామాక్షి దేవి అమ్మవారు ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.

ప్రారంభానికి నోచుకోని విశ్రాంతి గదులు



నూతనంగా నిర్మించిన రోగుల సహాయకుల విశ్రాంతి గదులు



చెట్లు కింద నిరీక్షిస్తున్న రోగుల సహాయకులు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో రోగుల సహాయకుల విశ్రాంతి గదులు ప్రారంభానికి నోచుకోలేదు. ఆసుపత్రిలో వైద్య సేవల కోసం వచ్చిన రోగులతో వచ్చే సహాయకులు ఆస్పత్రిలో ఉండడానికి అనుమతి లేదు. దీంతో సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతన్నారు. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు కార్పొరేట్ సామాజిక సేవా నిధులతో ఆడవారికి, మగవారికి వేర్వేరుగా గదులను నిర్మించారు. నిర్మాణం పూర్తయి సుమారు నెల రోజులు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో రోగులతో వచ్చే సహాయకులు ఆసుపత్రి ఆవరణలో ఉన్న చెట్ల కింద, బెంచీలపై నిరీక్షిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రోగుల సహాయకుల విశ్రాంతి గదులను ప్రారంభించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు తొలగించాలి

అనకాపల్లి టౌన్: పట్టణంలోని మెయిన్ రోడ్‌లో అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు తక్షణమే తొలగించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం ఓ ప్రకటనలో కోరారు. ట్రాఫిక్‌కు అడ్డంగా, విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల వల్ల ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. తక్షణమే జీవీఎంసీ, పోలీస్ అధికారులు స్పందించి పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సబ్బవరంలో వర్ష బీభత్సం



గొర్లివానిపాలెంలో నీటిలో చిక్కుకుపోయిన వాహనాలు

- నిలిచిపోయిన వాహనాలు
- కొట్టుకుపోయిన ఇళ్లలోని గ్యాస్ బండలు

సబ్బవరం: మండలంలో శనివారం మధ్యాహ్నం కురిసిన కుండపోత వర్షం బీభత్సం సృష్టించింది. పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. గొర్లివానిపాలెం జంక్షన్ వద్ద కొండల నుండి వచ్చే నీరు భారీగా చేరి, డ్రెయిన్లు పూడుకపోవడంతో వర్షపు నీరు నిలిచిపోయి రోడ్లు జలమయం అయ్యాయి. సబ్బవరం పోలీస్ స్టేషన్ సమీపంలోనూ అదే పరిస్థితి నెలకొంది. దీంతో గతంలో ఎన్నడూ చూడనంతగా సబ్బవరం ముంపునకు గురైందని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న గెడ్డవాగులను పూర్తిగా పూడ్చివేయడం, అభివృద్ధి చెందుతున్న సబ్బవరానికి ధీటైన డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయకపోవడంతో ఈ అవస్థలు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం సబ్బవరంలో 126.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



కొట్టుకుపోయిన గ్యాస్ బండలను తీసుకొస్తున్న వ్యక్తి

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



సందీప్ వినాయకవర్మ (ఫైల్)

పరవాడ: పెదముషిడివాడ శివారు నక్కవానిపాలెం రహదారిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు చెప్పారు. ఈ ప్రమాదంలో సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారానికి చెందిన సాగిరాజు సందీప్ వినాయకవర్మ (27) ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారానికి చెందిన సందీప్ వినాయక వర్మ తన ద్విచక్ర వాహనంపై పెదముషిడివాడ నుంచి శుక్రవారం రాత్రి స్వగ్రామమైన పైడివాడ అగ్రహారానికి వెళ్తున్న క్రమంలో నక్కవానిపాలెం సమీపంలోని మలుపులో తన ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సందీప్ వినాయక వర్మ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి వివాహం కావలసి ఉంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి శనివారం బంధువులకు అప్పగించినట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి మృతి చెందిన సందీప్ వినాయక వర్మ

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

పరవాడ: లంకెలపాలెం ఫ్లైఓవర్‌సమీపంలో తాడి మూడు మదుంల వంతెన పైన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహన్ని రైల్వే పోలీసులు శనివారం గుర్తించారు. విశాఖ నుంచి విజయవాడ వెళ్లే గుర్తు తెలియని రైలు ఢీ కొట్టడం వల్ల ఆ వ్యక్తి మృతి చెంది ఉండొచ్చని జీఆర్‌పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపారు. ఈ ప్రమాదంలో మృతుడు తీవ్రంగా గాయపడ్డాడన్నారు. మృతుడు 5.5 ఎత్తు, నల్లటి జుట్టు, నలుపు రంగు హాఫ్ నిక్కరు కలిగి ఉన్నాడు. మృతదేహంపై ఎలాంటి ఆధారాలు లభించలేదు. కుడి చేయి మణికట్టు వద్ద ఓం అని పచ్చబొట్టు ఉందని, ఆచూకీ తెలిసిన వారు 7382058996 నంబరుకు సమాచారం అందించాలని ఎస్ఐ లక్ష్మి కోరారు.

అదుపు తప్పి కంటైనర్ బోల్తా



లంకెలపాలెం సమీపంలో బోల్తా పడిన కంటైనర్

పరవాడ: అనకాపల్లి–విశాఖ జాతీయ రహదారిలో తాడి మూడు మదుంల సమీపంలో శనివారం తెల్లవారు జామున జరిగిన ఓ ప్రమాదంలో కంటైనర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కంటైనర్ సిబ్బంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలివి.. కాకినాడ నుంచి అనకాపల్లి మీదుగా విశాఖ పోర్టుకు లోడుతో వెళుతున్న భారీ కంటైనర్ తాడి మూడు మదుంల వద్దకు రాగానే, వాహనం టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి డివైడర్‌పై బోల్తా పడింది. ఈ ప్రమాదం తెల్లవారు జామున జరగడం, ఆ సమయంలో ప్రయాణికుల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బోల్తా పడిన కంటైనర్‌ను క్రేన్ సహాయంతో పక్కకు తొలగించి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేసినట్లు సీఐ తెలియజేశారు.

ప్రతి విద్యార్థి వ్యాపారవేత్తగా ఎదగాలి



చంద్రమోహన్‌ను అభినందిస్తున్న ఆచార్య డాక్టర్ సూర్యప్రకాశరావు

సబ్బవరం: ప్రతి విద్యార్థి వ్యాపారవేత్తగా ఎదిగితే భారత ఆర్థిక వ్యవస్థకు వారు బలమైన సైనికులుగా మారుతారని తమిళనాడు జాతీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు చంద్రమోహన్ అన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో 'వ్యాపార వేత్తల లక్షణాలు, కార్పొరేట్ ప్రపంచంలో వారి నాయకత్వం'అనే అంశంపై విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రమోహన్ మాట్లాడుతూ భారత ఆర్థికాభివృద్ధిలో అనేక సంస్థల వ్యవస్థాపకులు కీలకపాత్ర పోషించారని తెలిపారు. విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదగాలంటే సృజనాత్మకత, కొత్త ఆలోచనలు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యాపార ధోరణులను అనుసరించాలన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సూర్యప్రకాశరావు నాయకత్వాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.